క్లుప్తంగా

బీజేపీ అధ్యక్షుడిగా విజేందర్



నియామక పత్రాన్ని అందుకుంటున్న విజేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్‌: బడంగ్‌పేట్‌ కార్పొరేషన్‌ పరిధిలోని 19వ డివిజన్‌ బీజేపీ అధ్యక్షుడిగా విజేందర్‌ను నియమించారు. ఈ మేరకు బడంగ్‌పేట మున్సిపల్‌ కార్పొరేషన్‌ బీజేపీ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి నియామక పత్రాన్ని విజేందర్‌కు అందజేశారు. తనపై నమ్మకంతో డివిజన్‌ బాధ్యతలు అప్పగించిన పార్టీ పెద్దలకు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తానని ప్రకటించారు. మహేశ్వరం నియోజకవర్గంలో కాషాయ జెండాను ఎగురవేసేందుకు తన వంతుగా కృషి చేస్తానని స్పష్టం చేశారు. కాగా నూతన కమిటీ ప్రధాన కార్యదర్శిగా శ్రీనివాస్‌చారి, ఉపాధ్యక్షుడిగా యశ్వంత్‌తో పాటు కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు.

అనారోగ్యంతో కాంగ్రెస్‌ నేత మృతి



శ్రీరాములు మృతదేహానికి నివాళులర్పిస్తున్న పారిజాత

మహేశ్వరం: మండలంలోని ఘట్టుపల్లి గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ నాయకుడు బొల్లేపాక శ్రీరాములు అనారోగ్యంతో మృతి చెందారు. మంగళవారం పీసీసీ ప్రధాన కార్యదర్శి, బడంగ్‌పేట్‌ మేయర్‌ పారిజాత, శ్రీరాములకు నివాళులర్పించారు. ఆయన మృతి పార్టీకి తీరని లోటని అన్నారు. ఈ కార్యక్రమంలో బడంగ్‌పేట్‌ కాంగ్రెస్‌ ఫ్లోర్‌ లీడర్‌ ప్రభాకర్‌రెడ్డి, నాయకులు కుమార్‌, నారాయణ, పాండు, రాఘవేందర్‌రెడ్డి, ఆనంద్‌ నాయక్‌ పలువురు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న పోలీసులు

మహేశ్వరం: రాష్ట్రంలో ఎన్నికల కోడ్‌ అమలులోకి రావడంతో మండల కేంద్రంలోని శివగంగ రాజరాజేశ్వర ఆలయం ఎదుట హైదరాబాద్‌ వెళ్లే రహదారిపై మహేశ్వరం సీఐ ముని ఆధ్వర్యంలో మంగళవారం రాత్రి వాహనాలను తనిఖీ చేపట్టారు. వాహనాల్లో డబ్బులు, మద్యం తరలించకుండా నిఘా పెట్టినట్లు సీఐ తెలిపారు.

ఉద్యోగులకు బదిలీలు సహజం


సర్పంచ్‌ తులసీరాంనాయక్‌



సక్రునాయక్‌ను సన్మానిస్తున్న నాయకులు

కడ్తాల్‌: ఉద్యోగులకు బదిలీలు సహజమని మైసిగండి సర్పంచ్‌ తులసీరాంనాయక్‌ అన్నారు. మండల పరిధిలోని మైసిగండి ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎంగా పనిచేస్తున్న సక్రునాయక్‌ మంగళవారం బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హెచ్‌ఎం సక్రునాయక్‌ను గ్రామ ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. వార్డు సభ్యులు, నాయకులు పంత్యానాయక్‌, శంకర్‌నాయక్‌, రవినాయక్‌, గోపాల్‌నాయక్‌, రాజు, శంకర్‌, రమేశ్‌, గోపాల్‌ తదితరులు ఉన్నారు.

పట్టుపురుగుల పెంపకంతో లాభాలు




విద్యార్థులతో శక్రునాయక్‌, ఉపాధ్యాయులు

తలకొండపల్లి: పట్టుపురుగుల పెంపకం చాలా లాభదాయకమని పట్టు పురుగుల పెంపకం జిల్లా రైతుసంఘం అధ్యక్షుడు శక్రునాయక్‌ అన్నారు. వ్యవసాయానికి అనుబంధంగా రైతులు పట్టు పురుగుల పెంపకాన్ని చేపట్టి ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని పేర్కొన్నారు. కల్వకుర్తి కృష్ణవేణి డిగ్రీ కళాశాల విద్యార్థులు పట్టు పురుగుల పెంపకంపై అవగాహన నిమిత్తం మండల పరిధిలోని కోరింతకుంట తండాకు మంగళవారం విచ్చేశారు. పట్టుపురుగుల పెంపకంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రైతులు దశ్రు, వినోద్‌, శక్రు, విద్యార్థులు, అధ్యాపకులు, రైతులు పాల్గొన్నారు.

అస్త్రశస్త్రాలతో రె‘ఢీ’

- నియోజకవర్గంలో మొదలైన ఎన్నికల వేడి
- ఊపందుకున్న ప్రచారం
- బీఆర్‌ఎస్‌, కాంగ్రెస్‌, బీజేపీల మధ్యే ప్రధాన పోటీ



మహేశ్వరం: అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ ప్రకటనతో మహేశ్వరం నియోజకవర్గంలో రాజకీయం వేడెక్కింది. గెలుపు వ్యూహాలతో రాజకీయ పక్షాలు సమరానికి సిద్ధమవుతున్నాయి. పార్టీల నేతలు అస్త్రశస్త్రాలతో రెడీ అవుతున్నారు. నియోజకవర్గంలో ఇటీవల తుమ్మలూరు గ్రామంలో సీఎం కేసీఆర్‌ పర్యటించి పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించారు. మంత్రులు కేటీఆర్‌, హరీశ్‌రావు, మంత్రి సబితారెడ్డిని గెలిపించాలని ప్రజలను అభ్యర్థించారు. భారీ మెజార్టీతో గెలిపిస్తే మహేశ్వరాన్ని మరింత అభివృద్ధి చేసి మరో హైటెక్‌ సిటీగా మారుస్తారని సబితారెడ్డి కూడా స్పష్టం చేశారు.

నియోజకవర్గాన్ని చుట్టేసిన మంత్రి

సబితారెడ్డి నియోజకవర్గంలో మూడు నెలల నుంచి పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. మహేశ్వరం, మన్సాన్‌పల్లి, రావిర్యాల, బండంగ్‌పేట్‌ కార్పొరేషన్‌ పరిధిలో కుల సంఘాలకు స్థలాలు కేటాయించి భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి శంకుస్థాపనలు కూడా చేశారు. నియోజకవర్గానికి వందల కోట్ల రూపాయాలు తీసుకొచ్చి అభివృద్ధి చేశానని, మూడోసారి భారీ మెజార్టీతో గెలిపిస్తారని ఆమె ధీమాతో ఉన్నారు.

కాంగ్రెస్‌లో ఆశావహులు

కాంగ్రెస్‌ అభ్యర్థిని అధిష్టానం ఇంకా ప్రకటించలేదు. కానీ బడంగ్‌పేట్‌ మేయర్‌ పారిజాత, డీసీసీ అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, ఎనుగు జంగారెడ్డి, అమరేందర్‌రెడ్డి టికెట్‌ ఆశిస్తున్నారు. మహేశ్వరం, కందుకూరు, తుక్కుగూడ, జల్‌పల్లి, బడంగ్‌పేట్‌, మీర్‌పేట్‌, సరూనగర్‌ డివిజన్లలో మేయర్‌ పారిజాత ప్రచారం చేస్తున్నారు. ఆశావహులంతా నియోజకవర్గంలో ఆరు గ్యారంటీలతో ప్రజల వద్దకు వెళ్తున్నారు.

తలమునకలవుతున్న బీజేపీ

అభ్యర్థి ఎంపిక విషయంలో బీజేపీ ఇంకా నిర్ణయానికి రాలేదు. పలువురు టికెట్‌ను ఆశిస్తున్నారు. వారిలో ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అందెల శ్రీరాములు యాదవ్‌, రాష్ట్ర అధికార ప్రతినిధి తూళ్ల వీరేందర్‌ గౌడ్‌, జిల్లా అధ్యక్షుడు నర్సింహారెడ్డి, సరూర్‌నగర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ ఆకుల శ్రీవాణి ఉన్నారు. అయితే శ్రీరాములు, వీరేందర్‌ గౌడ్‌ మధ్యనే ప్రధాన పోటీ ఉంటుందని భావిస్తున్నారు. శ్రీరాములకే టికెట్‌ ఇచ్చే అవకాశాలున్నాయని కమలనాథులు అభిప్రాయపడుతున్నారు. టికెట్‌ ప్రకటన వెలువడిన ప్రచారాలతో జనంలోకి వెళ్లేందుకు నేతలు సిద్ధమవుతున్నారు.

పౌల్ట్రీతో పాట్లు

- కోళ్ల ఫాంలతో దుర్వాసన
- ఆరుబయటే వ్యర్థాలు
- ఈగలు, దోమల వ్యాప్తి
- వీధికుక్కల స్వైరవిహారం
- పట్టించుకోని అధికారులు



కొత్తగూడ సమీపంలో కోళ్ల వ్యర్థాలతో పౌల్ట్రీ ఫాం

కందుకూరు: కోళ్ల ఫారంల నుంచి వచ్చే దుర్వాసనతో స్థానిక ప్రజలు అనారోగ్యం పాలవుతున్నారు. మండలంలోని కొత్తగూడ గ్రామ సమీపంలో పౌల్ట్రీ ఫాం ఏర్పాటు చేయడంతో పాటు యాజమాన్యం నిర్వహణ లోపం.. ప్రజలకు సంకటంగా మారింది. ఆరుబయటే వ్యర్థాలను పడేయడంతో ఈగలు, దోమల వ్యాప్తి అధికమవుతోంది. మరోవైపు మృతి చెందిన కోళ్లను చుట్టుపక్కల పడేస్తున్నారు. వీటి కోసం కుక్కలు ఎగపడుతున్నాయి. కోళ్ల కోసం వచ్చే కుక్కలు ఎక్కడ దాడి చేస్తాయోనని జనాలు భయాందోళన చెందుతున్నారు. గ్రామస్తులు పలుమార్లు పౌల్ట్రీలపై చర్యలు తీసుకోవాలని అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

పరిష్కారమెప్పుడు?



పౌల్ట్రీల నుంచి వచ్చే దుర్వాసనతో అనారోగ్య పాలవుతున్నాం. మృతి చెందిన కోళ్లను తినడానికి వచ్చే కుక్కలు సంఖ్య అధికమవుతోంది. కుక్కలు పశువులపై దాడి చేస్తున్నాయి. దోమలు విజృంభిస్తున్నాయి. సమస్య పరిష్కరించాలి.

– దామోదర్‌రెడ్డి, కొత్తగూడ

నోటీసులిచ్చాం



పౌల్ట్రీల కారణంగా తీవ్ర దుర్వాసనతో గ్రామస్తులు అనారోగ్యం బారిన పడుతున్నారు. మరోవైపు ఈగలు, దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. పంచాయతీ నుంచి నిర్వాహకులకు నోటీసులు పంపాం. ఇంకా ఎలాంటి స్పందన రాలేదు.

– మల్లారెడ్డి, సర్పంచ్‌, కొత్తగూడ

సబితారెడ్డికే మద్దతు

- బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధి
- ఆ పార్టీ నాయకుడు కార్తీక్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న కార్తీక్‌రెడ్డి

కందుకూరు: మహేశ్వరం నియోజకవర్గాన్ని మంత్రి సబితారెడ్డి అభివృద్ధి చేశారని బీఆర్‌ఎస్‌ రాష్ట్ర నాయకుడు కార్తీక్‌రెడ్డి కొనియాడారు. మరోసారి మంత్రికే మద్దతుగా నిలిచి నియోజకవర్గం అభివృద్ధికి సహకరించాలని కోరారు. మంగళవారం మండల కేంద్రంలో కందుకూరు, మహేశ్వరం మండలాలకు చెందిన బీఆర్‌ఎస్‌ పార్టీ యూత్‌ నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. బీజేపీకి ఓటు వేస్తే మురికి కాలువలో వేసినట్లేనని ఎద్దేవాచేశారు. ఎన్నో ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్‌ పార్టీ ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. అభివృద్ధి కావాలంటే బీఆర్‌ఎస్‌కే ఓటు వేసి గెలిపించాలన్నారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ జంగారెడ్డి, మార్కెట్‌ కమిటీ చైర్మన్‌ సురేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు జయేందర్‌, నియోజకవర్గం యూత్‌ అధ్యక్షుడు పవన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు

తుక్కుగూడ: సూర్యగిరి ఎల్లమ్మ భక్తులకు ఇలవేల్పుగా మారింది. అధిక శ్రావణమాసంలో అమ్మవారికి ఇష్టమైన రోజు మంగళవారం కావడంతో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ ప్రాంగణంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు నిర్వహించారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్‌ చైర్మన్‌ రెడ్డిగళ్ల రత్నం, పాలక మండలి సభ్యులు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు, హోర్డింగులు తొలగింపు షురూ

మీర్‌పేట: ఎన్నికల కోడ్‌ నేపథ్యంలో మీర్‌పేట మున్సిపల్‌ కార్పొరేషన్‌ పరిధిలోని ఫ్లెక్సీలు, హోర్డింగులను కమిషనర్‌ వాణి ఆదేశాల మేరకు సిబ్బంది మంగళవారం తొలగించారు. మీర్‌పేట, జిల్లెలగూడ ప్రాంతాల్లోని ప్రధాన రహదారులు, కూడళ్లలో ఏర్పాటు చేసిన పలు రాజకీయ పార్టీలకు చెందిన ఫ్లెక్సీలు, పోస్టర్లు తొలగించినట్లు తెలిపారు. దాదాపుగా 90 శాతం వరకు తొలగించామని బుధవారం వరకు పూర్తి స్థాయిలో తొలగిస్తామని కమిషనర్‌ పేర్కొన్నారు.

సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం



సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహిస్తున్న కాలనీవాసులు

బడంగ్‌పేట్‌: గ్రీన్‌ జోన్‌, ఓపెన్‌ జోన్‌ నుంచి విముక్తి కల్పించి రెసిడెన్సియల్‌ జోన్‌గా మార్పు చేయించిన మంత్రి సబితారెడ్డి చిత్రపటానికి కాలనీల వాసులు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. బడంగ్‌పేట కార్పొరేషన్‌ పరిధిలోని అల్మాస్‌గూడలోని సర్వే నంబర్‌ 122, 123, 124, 129, అలాగే బడంగ్‌పేటలోని 148, 149 సర్వే నంబర్లలో 80 ఎకరాల్లో విస్తీర్ణంలో నివాసాలు ఏర్పాటు చేసుకున్నారు. అయితే 1980లో హెచ్‌ఎండీఏ అధికారులు ఈ సర్వే నంబర్లను ఓపెన్‌, గ్రీన్‌ జోన్‌ కింద చేర్చడంతో అప్పటినుంచి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయాన్ని మంత్రి సబితారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యమంత్రి కేసీఆర్‌, మంత్రి కేటీఆర్‌ దృష్టికి తీసుకెళ్లి ఓపెన్‌, గ్రీన్‌ జోన్‌ నుంచి విముక్తి కల్పించాలని కోరారు. ఈ నెల 3వ తేదీన రెసిడెన్సియల్‌ జోన్‌గా మారుస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఈ నేపథ్యంలోనే సబితారెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో పాటు బీఆర్‌ఎస్‌ మున్సిపల్‌ కార్పొరేషన్‌ అధ్యక్షుడు రాంరెడ్డి, కార్పొరేటర్లు రాంరెడ్డి, ఫ్లోర్‌ లీడర్‌ అర్జున్‌, నాయకులు జంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, ఆనంద్‌రెడ్డి పాల్గొన్నారు.

హక్కుల సాధనకు కలిసి పోరాడాలి



సమావేశమైన ముదిరాజ్‌ సంఘం నాయకులు

కందుకూరు: ముదిరాజ్‌లు ఆర్థికంగా, రాజకీయంగా చైతన్యం కావాలని ముదిరాజ్‌ రాష్ట్ర నాయకుడు ఎల్లయ్యముదిరాజ్‌ ఆకాంక్షించారు. మంగళవారం సాయంత్రం మండలంలోని దాసర్లపల్లి పరిధిలోని కుర్మమోని జయేందర్‌ముదిరాజ్‌ ఫాంహౌస్‌లో ముదిరాజ్‌ ముఖ్య నాయకుల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముదిరాజ్‌ల హక్కుల సాధన కోసం కలిసికట్టుగా అందరూ పోరాడాలని కోరారు. కార్యక్రమంలో ముదిరాజ్‌ సంఘం రాష్ట్ర నాయకులు ఎడ్ల బాబురావుముదిరాజ్‌, కుర్మమోని జయేందర్‌ముదిరాజ్‌, మండల అధ్యక్షుడు అంజయ్యముదిరాజ్‌, యూత్‌ అధ్యక్షుడు కొర్వి సురేందర్‌ముదిరాజ్‌, ప్రధానకార్యదర్శి జంగయ్యముదిరాజ్‌, శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

29న బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక

వనస్థలిపురం: బ్రాహ్మణ వెల్ఫేర్‌ అసోసియేషన్‌, వనస్థలిపురం ఆధ్వర్యంలో ఈ నెల 29న వనస్థలిపురంలోని శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయంలో 15వ వార్షిక బ్రాహ్మణ వధూవరుల పరిచయ వేదిక నిర్వాహకులు తెలిపారు. ఈనెల 19 రిజిస్ట్రేషన్లకు ఆఖరు తేదీ అని తెలిపారు. మరిన్ని వివరాలకు 9848224586ను సంప్రదించవచ్చు.

‘నిరుపేదలకు న్యాయం చేస్తా’



బాధితులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

హయత్‌నగర్‌: రోడ్డు పక్కన గుడిసెలు వేసుకున్న వారికి తగిన న్యాయం చేస్తామని, అప్పటి వరకు వారి నివాసాలను తొలగించకుండా చూస్తానని ఎల్బీనగర్‌ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. రోడ్డు విస్తరణలో భాగంగా హయత్‌నగర్‌లోని రేడియో స్టేషన్‌ సమీపంలో జాతీయ రహదారి పక్కన గుడిసెలను తొలగించాలనే ప్రయత్నం జరుగుతున్నదని తెలుసుకున్న ఎమ్మెల్యే మంగళవారం అక్కడికి చేరుకుని బాధితులతో మాట్లాడారు. సంబంధిత అధికారి ధర్మారెడ్డికి ఫోన్‌ చేసి వారి సమస్యను వివరించారు. కొన్ని రోజులు సమయం ఇస్తే వారిని మరో చోటికి తరలిస్తామని, అప్పటి వరకు గుడిసెలను తొలగించరాదని ఆయనను ఎమ్మెల్యే కోరారు. దీంతో గుడిసెల వాసులు ఎమ్మెల్యేకు ధన్యవాదాలు తెలిపారు.

క్రీడలతో మానసికోల్లాసం



విద్యార్థులకు క్రీడా సామగ్రిని అందజేస్తున్న కార్పొరేటర్‌ సుజాతా నాయక్‌

హస్తినాపురం: క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహదపడతాయని, ప్రతి విద్యార్థి క్రీడల్లో రాణించాలని హస్తినాపురం డివిజన్‌ కార్పొరేటర్‌ బానోతు సుజాతానాయక్‌ అన్నారు. డివిజన్‌ పరిధిలోని నందనవనం కాలనీలోని ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో విద్యార్థులకు క్రీడా సామగ్రిని ఆమె అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్‌ మాట్లాడుతూ, ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించడంతో పాటు క్రీడల్లో రాణించేందుకు అనేక పథకాలు ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. ప్రతి రోజూ ఆటలు ఆడితే మానసికంగా, శారీరకంగా ఎంతో మేలు జరుగుతుందని, విద్యార్థులు చదువుతోపాటు ఆటలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రామచంద్రనాయక్‌, మద్దిలి శివారెడ్డి, మమత, మల్లేశ్‌గౌడ్‌, సంగిశెట్టి భవాని, రేణుక, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఎన్నికల రిటర్నింగ్‌ అధికారిగా పంకజ

ఎల్బీనగర్‌: ఎల్బీనగర్‌ నియోజకవర్గం ఎన్నికల రిటర్నింగ్‌ అధికారిగా ఎల్బీనగర్‌ జోనల్‌ కమిషనర్‌ పంకజను రాష్ట్ర ఎన్నికల సంఘం నియమించింది. ఈఆర్‌ఓగా ఎల్బీనగర్‌ సర్కిల్‌–3 డీసీ రవీందర్‌కుమార్‌, సహాయ ఎన్నికల అధికారులుగా ఎల్బీనగర్‌ సర్కిల్‌–4, సర్కిల్‌–5 డీసీలు దశరథ్‌, అరుణ కుమారి, సునీతలు నియమితులయ్యారు.ఈ సందర్భంగా పంకజ మాట్లాడుతూ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు రాజకీయ పార్టీల నాయకులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు.

మాది జనరంజక పాలన

ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్‌: సీఎం కేసీఆర్‌ది జనరంజక పాలన అని ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం ఎల్మినేడులోని తన స్వగ్రామం నుంచి నియోజకవర్గ బీఆర్‌ఎస్‌ పార్టీ సమన్వయ కమిటీ సభ్యులతో ఆయన టెలీకాన్ఫరెన్స్‌ నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లలా ముందుకు వెళ్తున్నామన్నారు. ఎన్నికల నగారా మోగిన నేపథ్యంలో ఇంటింటికి వెళ్లి బీఆర్‌ఎస్‌ సర్కార్‌ చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని కోరారు.

కోడ్‌ ఉల్లంఘిస్తే కఠిన చర్యలు



ఫ్లెక్సీల తొలగింపు పనులను పర్యవేక్షిస్తున్న రవీంద్రసాగర్‌

మున్సిపల్‌ కమిషనర్‌ రవీంద్రసాగర్‌

ఇబ్రహీంపట్నం: ఎన్నికల కోడ్‌కు విరుద్ధంగా ఎలాంటి ప్రచారాలు చేయొద్దని మున్సిపల్‌ కమిషనర్‌ రవీంద్రసాగర్‌ తెలిపారు. మంగళవారం ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీలోని వివిధ పార్టీల ఫ్లెక్సీలు, కటౌట్లు, బ్యానర్ల తొలగింపు పనులను కమిషనర్‌ పర్యవేక్షించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రైవేట్‌ కార్యక్రమాలైనా.. ఎన్నికల రిటర్నింగ్‌ అధికారి అనుమతిని తప్పనిసరిగా తీసుకోవాలన్నారు. ఎన్నికల నియమావళికి వ్యతిరేకంగా ఎలాంటి బ్యానర్లు, కటౌట్లు, ఫ్లెక్సీలు పెట్టినా, అనుమమతి లేకుండా ప్రచారాలు చేపట్టినా చట్టరీత్యా చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఉన్నత పదవులు అధిరోహించాలి



ఉప్పల వెంకటేశ్‌ను సన్మానిస్తున్న రాంపూర్‌ నాయకులు

తలకొండపల్లి: మిషన్‌ భగీరథ కార్పొరేషన్‌ వైస్‌ చైర్మన్‌, జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను రాంపూర్‌ గ్రామ బీఆర్‌ఎస్‌ నాయకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఏంపీపీ నిర్మలఆధ్వర్యంలో హైదరాబాద్‌లో వెంకటేశ్‌ను కలిసిన రాంపూర్‌ గ్రామస్తులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. మరిన్ని ఉన్నత పదవులను అధిరోహించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చిన్న హరిమోహన్‌రెడ్డి, బీఆర్‌ఎస్‌ నాయకులు యాదయ్య, లక్ష్మీ వెంకటేశ్వర దేవాలయ కమిటీ మాజీ చైర్మన్‌ శ్రీశైలంయాదవ్‌ పాల్గొన్నారు.

సన్మానించిన కడ్తాల్‌ నాయకులు..

కడ్తాల్‌: మిషన్‌ భగీరథ వైస్‌ చైర్మన్‌గా నియమితులైన తలకొండపల్లి జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్‌ను మండల కేంద్రానికి చెందిన ప్రజాప్రతినిధులు మంగళవారం ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్‌ గంప వెంకటేశ్‌ గుప్తా, రైతుబంధు సమితి జిల్లా సభ్యుడు శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచ్‌ లక్ష్మీనర్సింహారెడ్డి, నాయకులు శ్రీనివాస్‌గుప్తా తదితరులు ఉన్నారు.

అగ్రకులాల ఆధిపత్యాన్ని కూలదోద్దాం



మాట్లాడుతున్న విశారదన్‌ మహరాజ్‌

డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు విశారదన్‌ మహరాజ్‌

ఇబ్రహీంపట్నం: అగ్రకులాల ఆధిపత్యం కూలదోసి అధికార పగ్గాలు చేపట్టేందుకు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ ఏకం కావాలని ధర్మ సమాజ్‌ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్‌. విశారదన్‌ మహరాజ్‌ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి ఇబ్రహీంపట్నంలో ధర్మ సమాజ్‌ పార్టీ ఆవిర్భావ సభ నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. ఇబ్రహీంపట్నం అసెంబ్లీ పరిధిలో 93 శాతం ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలుంటే మూడు శాతం లేని అగ్రవర్ణాలకే ఆయా పార్టీలు ఎలా టికెట్లు కేటాయిస్తున్నాయని ప్రశ్నించారు. రాజ్యాధికారాన్ని దక్కించుకునేందుకు సంఘటితంగా ముందుకు సాగాలని కోరారు. కేంద్ర ఎన్నికల సంఘం టార్చిలైట్‌ గుర్తును మన పార్టీకి కేటాయించిందని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. అసెంబ్లీ ఎన్నికల్లో ధర్మసమాజ్‌ పార్టీ అభ్యర్థి ఇబ్రహీంపట్నం స్థానం నుంచి పోటీలో ఉంటారని చెప్పారు. డీఎస్పీ బలపరిచిన అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి రాఘవేంద్ర, వినోద్‌యాదవ్‌, రవీందర్‌, భిక్షపతి, రాకేష్‌, భవానిశేఖర్‌, గజ్జ భాస్కర్‌, భవాని కిషన్‌, నాగార్జున, ప్రదీప్‌, ప్రవీణ్‌, రంజిత్‌లు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్‌లో చేరిక



ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరుతున్న నాయకులు

ఆమనగల్లు: మాడ్గుల మండలం ఆర్కపల్లి గ్రామానికి చెందిన వివిధ పార్టీలకు చెందిన 20 మంది నాయకులు మంగళవారం బీఆర్‌ఎస్‌లో చేరారు. హైదరాబాద్‌లోని కల్వకుర్తి ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్‌ సమక్షంలో వారు గులాబీ కండువా కప్పుకున్నారు. బీఆర్‌ఎస్‌ పార్టీతోనే సమన్యాయం సాధ్యమన్నారు. బీఆర్‌ఎస్‌ నాయకులు జైపాల్‌నాయక్‌, లాలయ్యగౌడ్‌ తదితరులు ఉన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



ఎంఈఓ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న మధ్యాహ్న భోజన కార్మికులు

మంచాల: మధ్యాహ్న భోజన కార్మికులు మంగళవారం మంచాల ఎంఈఓ కార్యాలయ ముట్టడికి యత్నించారు. వారు మాట్లాడుతూ.. సమస్యలు పరిష్కరించాలని 13 రోజులుగా నిరసన తెలుపుతున్న ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. గత 9నెలలకు సంబంధించిన వంట బిల్లులు ఇప్పటికీ విడుదల కాలేవన్నారు. వేతనాలు 18 నెలలుగా పెండింగ్‌లో ఉన్నాయని తెలిపారు. గుడ్లకు సంబంధించి మూడు సంవత్సరాల బిల్లులు ఇవ్వడం లేదన్నారు. మధ్యాహ్న భోజనం బిల్లులు చెల్లించలేని ప్రభుత్వం తాజాగా టిఫిన్స్‌ పెడతామని మరోసారి మోసం చేయడానికి చూస్తుందన్నారు. ప్రభుత్వం తక్షణమే మధ్యాహ్న భోజన పథకం బిల్లులు చెల్లించాలని డిమాండ్‌ చేశారు. కార్మికులు సంతోష, పద్మ, భారతమ్మ, జంగమ్మ, రాణి తదితరులు పాల్గొన్నారు.

బెల్టుషాపు నిర్వాహకుడి అరెస్టు



పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం సీసాలు

భారీగా మద్యం స్వాధీనం

ఇబ్రహీంపట్నం రూరల్‌: అనుమతి లేకుండా మద్యం విక్రయిస్తున్న ఓ వ్యక్తిని పోలీసులు అరెస్ట్‌ చేశారు. ఈ ఘటన ఆదిబట్ల పోలీస్‌స్టేషన్‌ పరిధిలో మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం.. బాలాపూర్‌ మండలం నాదర్‌గుల్‌లో వెంకటేశ్‌ అనే వ్యక్తి కిరాణా షాపు నిర్వహిస్తున్నాడు. అయితే మద్యానికి బానిసైన నిందితుడు డబ్బు సంపాదించాలనే ఆశలో తన షాపు ఎదుట ఉన్న ఖాళీ ప్రదేశంలో మద్యం విక్రయిస్తున్నాడు. స్థానికుల సమాచారంతో పోలీసులు సోదాలు చేశారు. నిందితుడి వద్ద నుంచి 173 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు.